


ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 9 మార్చి 2024

- అంతటా శివనామస్మరణ
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- నేత్రపర్వంగా లింగోద్భవ అభిషేకాలు
- కిక్కిరిసిన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి
- స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

శివాయ.. రుద్రాయ


పట్టు వస్త్రాలు తెస్తున్న గోపిరెడ్డి దంపతులు

ఓం నమః శివాయ.. శంభో శంకరా.. శివాయ రుద్రాయ.. నామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. మహాశివరాత్రి పర్వదినం.. కోటయ్యస్వామి తిరునాళ్లతో శుక్రవారం భక్తులు పులకించి.. తరించారు. శైవక్షేత్రాలు భక్తజనంతో నిండిపోయాయి. శివయ్య దర్శనానికి భక్త జనసందోహం పోటెత్తింది. స్వామి వార్లను దర్శించుకుని భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వీఐపీలు, ప్రముఖుల తాకిడితో కోటప్పకొండ, క్వారీ, గోవాడలతో పాటు అమరావతి, పెదకాకాని ఆలయాలు కిటకిటలాడాయి. విద్యుత్ దీపాలంకరణలతో నిర్మించిన ప్రభలను ఉత్సవంగా ఆలయాల వద్దకు భక్తులు తరలించారు. హర.. హరా.. చేదుకో కోటయ్య.. చేదుకో వయ్యా.. అంటూ తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు కోటయ్య క్షేత్రానికి లక్షలాదిగా తరలివచ్చారు. త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది.


కోటప్పకొండపై భక్తుల రద్దీ

వేలల్లో పాసులు.. ఆదాయానికి గండి

త్రికోటేశ్వరస్వామి దర్శనానికి వీఐపీ, వీవీఐపీ పాసులను పెద్దసంఖ్యలో జారీ చేశారు. డీఆర్వో కార్యాలయం నుంచి 20 వేలకు పైగా పాసులు పంపిణీ చేసినట్లు సమాచారం. వీఐపీల పేరుతో వేలాది మంది స్వామి దర్శనం చేసుకున్నారు. ఒక్కొక్క వీఐపీ వెంట అధిక సంఖ్యలో వారి అనుచరులు తరలివచ్చారు. వీఐపీల కారణంగా ఉచిత, రూ100 క్యూల్లోని భక్తులు స్వామిదర్శనం కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీగా వీఐపీ పాసుల జారీతో ఆలయ ఆదాయానికి గండి పడింది. వీఐపీల వాహనాలను కొండపైకి అనుమతించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీల సేవలో కొందరు అధికారులు తరించారు.

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 8: ప్రఖ్యాత శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి శుక్రవారం భక్తులతో పోటెత్తింది. కొండ ప్రాంత మంతా జన సంద్రమైంది. సాయంత్రం నుంచి యాత్రికుల రద్దీ అంతకంతకు పెరిగింది. అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకం వైభవంగా జరిగింది. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించడంతో స్వామికి ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టు వస్త్రాలు, వెండి ప్రభను సమర్పించారు. తెల్లవారుజామున అర్చకులు బిందె తీర్థంతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పంచామృతాలతో ఘనంగా అభిషేకాలు జరిపి స్వామికి విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. కొండ దిగువన బొచ్చు కోటయ్యస్వామి వద్ద తల నీలాలను భక్తులు సమర్పించారు. కొండపైన ఉన్న పాతకోటేశ్వర స్వామి, పాపవినాశేశ్వర స్వామి, దిగువన ఉన్న విఘ్నేశ్వరస్వామి, సోపానమార్గంలోని ఆనందవల్లి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ధ్యాన శివుడు, విఘ్నేశ్వరుడు, నంది, నాగేంద్రస్వామి పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. రెండు అభిషేక మండపాల్లో వేలాది మంది భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ఈవో శ్రీనివాసరెడ్డి, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షించారు. 3,000 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్, ఐజీ పాలరాజు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఆర్డీవో సరోజ డీఎస్పీ వర్మలతో పాటు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పరిశీలిస్తూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి 528కి పైగా ప్రత్యేక ఆర్టీసీ బస్సులను కొండకు ఏర్పాటు చేశారు. యాత్రికు లకు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు సత్యసాయి సేవా సమితి, స్కౌట్ విద్యార్థులు క్యూల్లోని భక్తులకు మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొండ దిగువన పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగుల కళా పరిషత్, నవ భారత దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభా వంతులు దివ్యాంగుల చేత సంగీత విభావరి నిర్వహించారు. కొండ దిగువన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

కనువిందు చేసిన ప్రభలు

తికోటేశ్వరస్వామి తిరునాళ్లకు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన 21 భారీ విద్యుత్ ప్రభలు కొండలో కొలువు దీరాయి. ఉదయం 11 గంటల కల్లా భారీ విద్యుత్ ప్రభలు కొండకు చేరుకున్నాయి. చిలకలూరిపేట రహదారిలో విద్యుత్ ప్రభల ఉత్సవం శోభాయమానంగా సాగింది. నరసరావుపేట రహదారిలో సాధారణ ప్రభలతో కోలాహలం నెలకుంది. ఆలయం, ప్రభల వెలుగులతో కొండ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగొందింది. ప్రభల విద్యుత్ కాంతులు భక్తులకు కనువిందు చేశాయి. తెల్లవార్లు ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ట్రాఫిక్ జామ్.. భక్తులు అవస్తలు

కోటప్పకొండ ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామైంది. వీఐపీ బస్సు బ్రేక్ డౌన్‌తో పెద్దసంఖ్యలో బస్సులు నిలిచిపోయాయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు గంటన్నర పాటు బస్సులు లేక భక్తులు అల్లాడిపోయారు. నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులో గురవపాలెం సమీపంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. కొండకు వెళ్లే భక్తులకు ట్రాఫిక్ కష్టాలు ఎదురయ్యాయి. పోలీసులు వన్ వే నిర్వహించినా వాహన చోదకులు నిబంధన పాటించకపోవడంతో పలుచోట్ల ట్రాఫిక్ జామైంది. పెట్లూరివారిపాలెం గ్రామం వద్ద వినుకొండ రోడ్డులో కొండకు ప్రభను తరలిస్తున్న సమయంలో సుమారు రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.


స్వామి వారి అభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు


తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



కొండ ఘాట్‌రోడ్డులో ఆగిపోయిన బస్సు




- ప్రభల వద్ద రికార్డింగ్ డాన్సులు


భక్తులకు దారి పొడవునా ట్రాఫిక్ కష్టాలే...




గోవాడలో మహిళల పొంగళ్లు

గోవాడకు భక్తుల తాకిడి

అమృతలూరు: ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం భక్త జన సందోహంతో కిటకిటలాడింది. ప్రత్యేక పూజలు అనంతరం అర్ధరాత్రి 1 గంట నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి దర్శనానికి శుక్రవారం ఉదయం నుంచి భక్తుల తాకిడి ప్రారంభమైంది. అభిషేక మండపంలో అభిషేకాలకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో భక్తుల రద్దీ నెలకుంది. ట్రాక్టర్లపై రైతులు తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. భక్తులకు తాగునీటి ప్యాకెట్లు, పులిహోర ప్రసాదాలను పంపిణీ చేశారు. సామాజిక సత్రాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.



అమరేశ్వరుడికి అభిషేకాలు

అమరావతి: పంచారామాల్లో ప్రసిద్ధమైన అమరారామంలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి బిందె తీర్థం, అభిషేకాలు జరిగాయి. కృష్ణానదిలో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షవర్ల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకునేందుకు క్యూల్లో బారులు తీరారు. లింగోద్భవకాలంలో అభిషేకాలు జరిగాయి.


అమరావతిలో భక్తుల క్యూ

క్వారీకి పోటెత్తిన భక్తులు

పొన్నూరుటౌన్: మహిమాన్విత శైవక్షేత్రం క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. చేబ్రోలు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పొంగళ్లను వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. వడ్లమూడి నారాకోడూరు, చేబ్రోలు, వేజండ్ల, సుద్దపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు భారీ విద్యుత్ ప్రభలను నిర్మించి స్వామి ఆలయానికి తరలించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచి నీరు, మజ్జిగ, ప్రసాదాలను పంపిణీ జరిగింది. మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పలు ప్రభల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.


క్వారీలో విద్యుత్ ప్రభ

కాకాని మల్లన్నసన్నిధి.. కిటకిట

పెదకాకాని: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాకానిలోని మల్లన్నసన్నిధి భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయం ఎదుట ఉన్న యజ్ఞాల బావి వద్ద భక్తులు పవిత్ర స్నానం ఆచరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి మల్లేశ్వరస్వామి వారికి అభిషేకాలు జరిపించారు, భ్రమరాంబ అమ్మవారికి కుంకుమ పూజ జరిపించారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి ఏకాదశ ద్రవ్యాలతో వేదపండితులు అభిషేకాన్ని జరిపించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో భక్తులు పరవశించి పోయారు. గజవాహనంపై ఉభయదేవేరి సమేతుడైన మల్లేశ్వరుడు పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు.


పెదకాకాని మల్లికార్జునుడి సన్నిధిలో కిక్కిరిసిన భక్తులు

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి

- త్రికాయ నృత్య ప్రదర్శనల ప్రారంభోత్సవంలో బ్రహ్మణి

మంగళగిరి సిటీ, మార్చి 8: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సతీమణి బ్రహ్మణి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం తూర్పు రాజగోపురం ఎదురుగా టీటీడీ కల్యాణ మండపం వద్ద త్రికాయ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి, బ్రహ్మణి జ్యోతి ప్రజ్వలన చేసి నృత్య ప్రదర్శనలను ప్రారంభించారు. త్రికాయ నృత్యశాల ఆధ్వర్యంలో ప్రదర్శించిన పలు నృత్యాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల అనంతరం బ్రహ్మణి మాట్లాడుతూ మహాశివుడు తన శరీరంలో అర్థభాగాన్ని పార్వతీదేవికి ఇచ్చి మహిళామూర్తుల పట్ల తన గౌరవాన్ని చాటుకున్నారని తెలిపారు. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన భారతీయ విలువలు, సంస్కృతిని భావి తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక నృత్యాలను ప్రదర్శించిన త్రికాయ నృత్యశాల బృందానికి జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నందం అబద్దయ్య, మహిళా నేతలు పాల్గొన్నారు.




నృత్య ప్రదర్శనలను తిలకిస్తున్న వసుంధర దేవి, బ్రహ్మణి

జోరుగా కోడి పందాలు

- రొంపిచర్ల మండలంలో రెండు చోట్ల నిర్వహణ
- మునమాక, రొంపిచర్ల వద్ద బరులు
- అధికార పార్టీ నేతల అధ్వర్యంలోనే..


మునమాక సమీపంలో జరుగుతున్న కోడి పందాలు

7లో..

‘ప్లానింగ్’లో పీజీ

దిక్సూచి



విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏవీ)- పీజీ ప్రోగ్రామ్‌లలో డైరెక్ట్ అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ విభాగాల్లో 12 రెగ్యులర్ సీట్లు; డిజైన్ విభాగంలో 13 రెగ్యులర్ సీట్లు, 12 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.

ఆర్కిటెక్చర్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్‌లో సస్టయినబుల్ ఆర్కిటెక్చర్, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్, ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ ఆర్కిటెక్చర్ పూర్తి చేసి ఉండాలి. మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌కు(బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ/కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్/కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి. మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌కు బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, ఏడాది అనుభవం ఉన్నవారు; బ్యాచిలర్స్ డిగ్రీ(ఫైన్ ఆర్ట్స్/డిజైన్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ప్లానింగ్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ ప్రోగ్రామ్ ఉంది. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ(ప్లానింగ్/ ఆర్కిటెక్చర్) లేదా (బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లకు మాస్టర్స్ డిగ్రీ(జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ) పూర్తిచేసిన అభ్యర్థులు; ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు మాస్టర్స్ డిగ్రీ(ఎకనామిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ ప్రక్రియ: అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. సంస్థ నిర్ణయం మేరకు ఇందులో అర్హత పొందినవారికి సంబంధించి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ పరిశీలన, పోర్ట్‌ఫోలియో అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **వెబ్‌సైట్:** www.spav.ac.in

‘దిక్సూచి’ వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Op0mxNDలో చదవండి.



సింహం నక్కల మీదకు వస్తే వార్ అవదురా లఫూట్



నందమూరి బాలకృష్ణ దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ను మహా శివరాత్రి సందర్భంగా విడుదల చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌తో రూపొందించిన ఈ గ్లింప్స్‌లో బాలకృష్ణ కూల్‌గా, ప్రశాంతంగా కనిపిస్తూనే తనదైన శైలిలో పవర్‌ఫుల్ డైలాగ్‌తో అదరగొట్టారు. కొంతమంది గూండాలు తన వైపు పరిగెత్తుకుని వస్తుంటే బాలయ్య కూల్‌గా ఆల్కహాల్ తాగుతుండడం ఆకట్టుకుంది. ‘ఏంట్రా వార్ డిక్లేర్ చేస్తున్నావా’ అని వచ్చిన వాళ్లలో ఒకడు అడిగితే ‘సింహం నక్కల మీదకు వస్తే వార్ అవదురా.. ఇట్స్ కాల్డ్ హంటింగ్’ అంటూ పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పి బాలకృష్ణ వేట మొదలుపెట్టడం గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ఈ గ్లింప్స్ బాలకృష్ణ అభిమానుల్ని, సినీ ప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఇందులో ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. థమన్, ఫొటోగ్రఫీ: విజయ్ కార్తిక్, ఎడిటింగ్: నిరంజన్, సమర్పణ: శ్రీకర్ స్టూడియోస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య

భైరవుడై.. రక్షకుడై...



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘కల్కి 2898 ఏడీ’. మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం ఈ చిత్రం నుంచి ప్రభాస్ పాత్రను యూనిట్ పరిచయం చేసింది. భైరవగా సరికొత్త లుక్‌లో ప్రభాస్ అలరించారు. భవిష్యత్తులో కాశీ నగరంలో జరిగే కొన్ని సంఘటనల నేపథ్యంలో సాగిన ప్రత్యేక వీడియో సినిమాపై ఆసక్తిని పెంచింది. కాశీ ప్రజలను విలన్ల నుంచి కాపాడే రక్షకుడిగా ప్రభాస్ కనిపించారు. వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే నటిస్తున్నారు. కమల్‌హాసన్ ప్రతినాయక పాత్రలో అలరించనున్నారు. అమితాబ్‌బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఇటలీలో ప్రభాస్, దిశా పటానీపై ఓ పాటను చిత్రీకరిస్తున్నారు.

ధనుష్ కుబేర



జాతీయ అవార్డు చిత్రాల దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందిస్తున్న తాజా చిత్రానికి టైటిల్ నిర్ణయించారు. ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు ‘కుబేర’ అని పేరు పెట్టారు. మహాశివరాత్రి సందర్భంగా సినిమా టైటిల్ వెల్లడించి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అత్యంత సంపన్నుడైన దేవుడు కుబేరుడు. ఆయన పేరునే ఈ సినిమాకు పెట్టారు. కానీ విడుదల చేసిన పోస్టర్‌లో ధనుష్ లుక్ టైటిల్‌కు భిన్నంగా ఉంది. చిరిగిన బట్టలతో అన్నపూర్ణా దేవి నుంచి శివుడు భిక్ష తీసుకుంటున్న పెయింటింగ్ ముందు ధనుష్ నిలబడి కనిపించారు. దీంతో ఆయన పాత్ర ఎలా ఉంటుందో అనే ఆసక్తి పెరిగింది. అలాగే మరో కీలక పాత్ర పోషిస్తున్న నాగార్జున లుక్ ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. రష్మిక ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.

కాశీలో శివశక్తి



తమన్నా ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం ‘ఓదెల 2’. ‘ఓదెల రైల్వేస్టేషన్’ చిత్రానికి ఇది సీక్వెల్. ఇటీవలే కాశీలో చిత్రీకరణ ప్రారంభమైంది. అశోక్‌తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మిస్తున్నారు. ఇందులో తమన్నా శివశక్తి అనే పాత్ర పోషిస్తున్నారు. శివరాత్రి సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నాగా సాధువు అవతారంలో తమన్నా సరికొత్తగా కనిపించారు. ఈచిత్రంలో హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

అదిగో కన్నప్ప



పరమశివుని భక్తుడు కన్నప్ప జీవితగాథ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం ‘కన్నప్ప’. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్నాడు. శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం నుంచి కన్నప్ప పాత్రధారిగా విష్ణు ఫస్ట్‌లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. విల్లు ఎక్కుపెట్టిన భంగిమలో శక్తిమంతంగా కనిపించి ఆకట్టుకున్నారు. ‘గొప్ప శివభక్తుని పాత్రలో నటించడం అదృష్టంగా భావిస్తున్నా. ఇదిగో మీ కన్నప్ప.. హర హర మహదేవ్’ అని విష్ణు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ చిత్రానికి ముఖేశ్ కుమార్ దర్శకుడు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించడంతో పాటు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభాస్ పరమశివుని పాత్ర పోషిస్తున్నారు. శరత్‌కుమార్, మోహన్‌లాల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

ఎనిమిది భాగాలుగా హాఫ్ లయన్



ప్రకాశ్ ఝా

దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితం ఆధారంగా ప్రముఖ ఓటీటీ సంస్థ ‘ఆహా’ ‘హాఫ్ లయన్’ పేరుతో వెబ్‌సిరీస్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. వినయ్ సీతాపతి రచన ‘హాఫ్ లయన్’ పుస్తకం దీనికి ఆధారం. ప్రకాశ్ ఝా దర్శకత్వంలో ఆహా స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సిరీస్ గురించి ఓ ఇంటర్వ్యూలో ప్రకాశ్ ఝా మాట్లాడుతూ ‘పీవీ నరసింహారావు ప్రధానిగా తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. ఉమ్మడి ఆంధ్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా ఆయన జీవితంలోని కీలకఘట్టాలను స్పృశిస్తూ ఈ సిరీస్ సాగుతుంది. ‘తెలుగువాళ్లు గర్వించే వ్యక్తి పీవీ, ఆయన బయోపిక్ చేద్దాం’ అని నిర్మాత అల్లు అరవింద్ నన్ను కలిశారు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది’ అని చెప్పారు. ఈ సిరీస్ ఎనిమిది ఎపిసోడ్లుగా ఉంటుంది, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పూర్తయింది అని ఆహా సహ వ్యవస్థాపకులు అజిత్ ఠాకూర్ చెప్పారు. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సిరీస్ తెరకెక్కిస్తున్నాం, త్వరలో నటీనటుల ఎంపిక ప్రారంభించి, ఈ ఏడాది ద్వితీయార్థంలో చిత్రీకరణ ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.





వచ్చేనెల 7వ తేదీ వరకు 12 రైళ్ల రద్దు

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు 12 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు.07783 విజయవాడ - గుంటూరు, 07788 గుంటూరు - విజయవాడ, 07779 గుంటూరు - మాచర్ల, 07780 మాచర్ల - గుంటూరు, 07580 మాచర్ల - నడికుడి, నెంబరు. 07579 నడికుడి - మాచర్ల, నెంబరు.07628 విజయవాడ - గుంటూరు, 07464 విజయవాడ - గుంటూరు, 07465 గుంటూరు - విజయవాడ, 07786 గుంటూరు - రేపల్లె, 07873 రేపల్లె - తెనాలి, 07630 తెనాలి - విజయవాడ రైళ్లను ఏప్రిల్ 7వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. నెంబరు. 17282 నరసపూర్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ విజయవాడ వరకే ప్రయాణిస్తుందని చెప్పారు. ఈ కారణంగా నెంబరు. 17281 గుంటూరు - నరసపూర్ రైలు విజయవాడ నుంచి నరసపూర్‌కు వరకు వెళుతుందన్నారు.

రైలు కింద పడి ఇద్దరి మృతి

వినుకొండటౌన్, మార్చి8: ప్రమాదవశాత్తు రైలు కింద పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన ఇందిరానగర్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. బహిర్భూమికి వచ్చి ప్రమావద వశాత్తు రైలుకింద పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 65 సంవత్సరాలు ఉండవచ్చని, శరీరంపై తెల్లటి చొక్క, పంచె ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆచూకి తెలిసిన వారు 9440438256 ఫోన్ నెంబర్ సంప్రదించాలన్నారు. అదేవిదంగా కురిచేడు సమీపంలో సాఫ్టువేర్ ఉద్యోగి యర్రగొండ రవికుమార్ (38)అనే యువకుడు రైలు క్రింద పడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రకాశంజిల్లా, దర్శి మండలం తానంచితలకు చెందిన వ్యక్తిగా గుర్తించి, బంధువులకు సమాచారం అందినట్లు రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు.

నవ్యాంధ్ర సుభిక్షంగా ఉండాలి..

● మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


బొప్పూడి ప్రభను సందర్శించిన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 8: పాలకుల చేతిలో మోసపోయిన నవ్యాంధ్రను కాపాడాలని, పల్నాడు ప్రజల కొంగు బంగారం త్రికోటేశ్వరుని ప్రార్థించినట్టు మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ నాయ కులతో కలసి ఆయన త్రికోటేశ్వరుని దర్శించుకు న్నారు. రాబోయే రోజుల్లో ప్రజల బాధలు తీర్చే సర్కారు రావాలని ప్రత్యేక పూజలు చేసినట్టు తెలిపారు. పరమ శివుడు దక్షణా మూర్తి రూపంలో ఉన్న ఏకైక క్షేత్రం కోటప్పకొండ కావటం ఇక్కడి ప్రజల అదృష్టంగా ఆయన వివరించారు. అనంతరం కావూరు, బొప్పూడి, కమ్మవారిపాలెం, గోవిందాపురం, యడవల్లి, మద్దిరాల, అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం, కోమటినేని వారిపాలెంల నుంచి వచ్చిన ప్రభలను సందర్శించి పూజలు నిర్వహించారు. ప్రభలు నిర్మించిన టీడీపీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. అనంతరం కాకతీయ అన్నదాన సత్రంలో అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్రం నిర్వాహకులు ప్రత్తిపాటిని ఘనంగా సత్కరించారు.

దేవుని వాక్యం బలమైనది

పాస్టర్లు జాన్‌వెస్లీ, రమేష్ ● రెండోరోజు భక్తిశ్రద్ధలతో కొనసాగిన గుడారాల పండుగ


రెండవరోజు జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు అబ్రహం, పాస్టర్ రాజు, హజరైన విశ్వాసులు

గుంటూరు(తూర్పు), మార్చి8: దేవుని వాక్యం బలమైనదని, ఆ వాక్యం ద్వారా కుంగినవాడు కూడా విడుదల పొందుతాడని పాస్టర్లు జాన్‌వెస్లీ, రమేష్‌లు సందేశమిచ్చారు. గోరంట్ల సమీపంలో జరుగుతున్న 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ రెండోరోజైన శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది విశ్వాసుల పాల్గొన్నారు. ఉదయం ప్రార్థనలను యర్రగొండపాలెంకు చెందిన మోజేష్‌లు ప్రారంభించి సందేశమిచ్చారు. రెండవ ప్రసంగాన్ని నల్గొండకు చెందిన పాస్టర్ సైమన్, ఒంగోలుకు చెందిన పాస్టర్ రాజు సందేశమిచ్చారు. అనంతరం పాస్టర్లు రమేష్, జాన్‌వెస్లీలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనసు మార్చుకుని పరిశుద్ధ ఆత్మతో జీవించాలని సందేశమిచ్చారు. ఈ సందర్భంగా హోసన్న సువార్త గాయకులు ప్రేమ పూర్ణుడా, ఘనమైనవి నా కార్యాలు అనే గీతాలను ఆలపించారు. సాయంత్రం ప్రార్థనలను మచిలీపట్నంకు చెందిన రాజేష్ ప్రారంభించి దేవుని వ్యాక్యాన్ని ఉపదేశించారు. అద్దంకి నుంచి అంధులు చేసిన కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. అర్ధరాత్రి ప్రార్థనల్లో హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు అబ్రహం ప్రసంగించారు.

ఈ స్థలం పవిత్రమైనది : పెమ్మసాని

ఈ స్థలం పవిత్రమైనదని దీనిని బలపరిచిన హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్లు, నిర్వాహకులను అభినందిస్తున్నట్టు గుంటూరు పార్లమెంటు టీడీపీ నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు, గోరంట్ల, హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న గుడారాల పండుగ రెండవ రోజున జరిగే ప్రార్థనలలో టీడీపీ నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాదు, నక్కా ఆనంద్‌బాబు, బూర్ల రామాంజనేయులు, మద్దిరాల మ్యానీ, ఇతర జనసేన, టీడీపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ 1977లో 80 మందితో మొదలైన పండుగ నేడు ఐదు లక్షల మందికి చేరుకొందంటే దాని వెనుక ఏసుక్రీస్తు ఆశీస్సులు ఉన్నాయన్నారు. శాంతి ప్రేమ పంచడానికి ఏసుక్రీస్తు జన్మించారని ఆయన మార్గంలో నడవాలని కోరారు. కక్షతో గాకుండా క్షమాబిక్షతో జీవించాలని తెలిపారు. దేవుని ఆశీర్వాదం పొంది ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు అనంతరం హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు అబ్రహం, చీఫ్ పాస్టర్, జాన్‌వెస్లీ, పాస్టర్లు రాజు, రమేష్ ఫ్రైడి పాల్ చేసిన ప్రార్థనల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు.

కోటప్పకొండ.. భక్తజనసంద్రం

త్రికూటాద్రిలో తిరునాళ్ల సందడి.. వీఐపీల రద్దీ.. వారి సేవలో అధికారులు.. సత్రాల్లో లక్ష మందికి అన్నప్రసాద వితరణ

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 8: ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి శుక్రవారం భక్తజన సంద్రంతో నిండిపోయింది. కోటయ్యస్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది. లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకొని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోపాన మార్గంలో కూడా భక్తులతో రద్దీ నెలకొంది. అర్ధరాత్రి వరకు కొండకు భక్తులు తరలివస్తూనే ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొండ ఎగువున, దిగువున ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మందలు పంపిణీ చేశారు.

తిరునాళ్లలో త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలోని పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ యాత్రికుల సందడి నెలకుంది. చిన్నారులు, పెద్దలు అందరూ బోట్ షికార్ చేశారు. పిల్లల రాజ్యం పార్కులో చిన్నారులు ఆట వస్తువులతో ఉత్సాహంగా ఆడుకున్నారు. పర్యాటక కేంద్రంలోని జింకలు, పక్షులు, నెమళ్లు, అక్వేరియంలను సందర్శించారు. కొండ దిగువున వున్న స్టాల్స్‌లో ఆట వస్తువులు, చెరకుల విక్రయాలు జరిగాయి. రంగుల రాట్నాలతో యాత్రికులు సందడి చేశారు. కొండ దిగువున పౌర సంబందాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగుల కళా పరిషత్, నవభారత దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభా వంతులు దివ్యాంగుల చేత సంగీత విభావరి నిర్వహించారు. కొండ దిగువున వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

నరసరావుపేట మండలం కాకాని నుంచి రెండు, ఉప్పలపాడు, గురవాయపాలెం, చిలతలపాలెం నుంచి ఒక్కొక్క ప్రభ కొండలో కొలువుదీరాయి. పురుషోత్తపట్నం నుంచి 6, యడవల్లి, కోమటినేనివారిపాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, బొప్పూడి నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివచ్చాయి. తెల్లవార్లు ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. నరసరావుపేట పట్టణం, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో సాధారణ ప్రజలు కొండకు తరలి వచ్చారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

కోటయ్య స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, మద్దాళి గిరి, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి. కలెక్టర్ శివశంకర్, ఐజీ పాలరాజు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాంప్రసాద్, ఆప్కో చైర్మన్ చిరంజీవి తదితరులు స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

పెద్ద ఎత్తున అన్నదానం

కొండ దిగువున ఉన్న సామాజిక సత్రాలలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఒక్కొక్క సత్రంలో వేలాది మందికి అన్నదానం జరిగింది. సత్రాలలో లక్ష మందికి పైగా అన్నదానం జరిగింది. కాకతీయ, శ్రీకృష్ణదేవరాయ, యోగి వేమారెడ్డి, ముదిరాజులు, శాలివాహన, నాయీబ్రాహ్మణ, రజక, బ్రాహ్మణ, ఆది శైవ, వీర శైవ, విశ్వ బ్రాహ్మణ, తొగటి వీర క్షత్రియ తదితర సామాజిక వర్గాల సత్రాలలో భారీగా అన్నదానం జరిగింది.

ఎన్నికల బాండ్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు


మహిళా ప్రణాళికను ఆవిష్కరిస్తున్న వీ శ్రీనివాసరావు, పాశం రామారావు తదితరులు

గుంటూరు(తూర్పు), మార్చి 8: ఎన్నికల బాండ్ల రూపంలో ఆయా రాజకీయ పార్టీలకు చేరిన నిధులపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దేశంలో ఎన్నికల బాండ్లు అనేది పెద్ద అవినీతి అని, దాదాపు రూ.64వేల కోట్ల నల్లధనం ప్రధాన పార్టీల వద్ద ఉందని సాక్షాత్తూ సుప్రీంకోర్టు చెబుతోందని గుర్తుచేశారు. శుక్రవారం గుంటూరు, బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో మహిళ ప్రణాళిక అమలుపై రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి లేకనే మోదీ అయోధ్య రామాలయం పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పారదర్శక పాలన కేవలం ఇండియా కూటమితోనే సాధ్యమవుతుందన్నారు. మోదీ, జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని, అందుకే మహిళా ప్రణాళిక అమలుకై సీపీఎం ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు డి.లక్ష్మీనారాయణ, ఈమని అప్పారావు, బైరగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కోడి పందాలు

● మునమాక, రొంపిచర్ల వద్ద నిర్వహణ
● అధికార పార్టీ నేతల అధ్వర్యంలోనే..


రొంపిచర్ల మండలం మూనమాక సమీపంలో కోడి పందాలు

నరసరావుపేట, మార్చి 8: అధికార పార్టీ అండదండలతో శుక్రవారం కోడి పందాలు జోరుగా సాగాయి. వరుసగా ఐదవ ఏడాది పందాలు నిర్వహించి పోలీసు శాఖకు నేతలు సవాలు విసిరారు. సందట్లో సడేమీయా చందాన పోలీసులు కోటప్పకొండ తిరునాళ్ల బందోబస్తులో ఉన్న నేపథ్యంలో అధికార పార్టీ నేతలు రెండు చోట్ల బరులు ఏర్పాటు చేసి పందాలు నిర్వహించడం గమనార్హం. నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల మండలంలో రెండుచోట్ల పందాలు బహిరంగంగానే జరిగాయి. గతంలో అధికార పార్టీ నేతలు కలసి ఒక చోటే పందాలు ఏర్పాటు చేసేవారు. ఈసారి అధికార పార్టీ నేతలు ఇరు వర్గాలుగా విడిపోయి రెండు చోట్ల పందాలు నిర్వహించారు. మునమాక సమీపంలో, రొంపిచర్ల వద్ద రెండు చోట్ల పందాలు జరిగాయి. గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి కూడా పందెం రాయుళ్ల పందెంలో పాల్గొన్నట్టు చెబుతున్నారు. మద్యం అమ్మకాలు పెద్దఎత్తున జరిగాయి. ఒక్కో పోటీకి లక్షల్లో చేతులు మారాయి. పోలీసు శాఖకు సమాచారం అందినా మిన్నకున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రొంపిచర్ల మడలంలో మాత్రం శివరాత్రి కోడి పందాలు నిర్వహించడం అధికార పార్టీ అనవాయితీగా కొనసాగిస్తోంది.

తిరునాళ్లలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు

కోటప్పకొండ తిరునాళ్లలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరిగాయి. చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు అక్రమార్కులు పంచన చేరిపోయారు. తిరునాళ్ల సందర్భంగా కోటప్పకొండకు 10 కిలోమీటర్ల వరకు మద్య నిషేదాన్ని ఎక్సైజ్ శాఖ విధించింది. ఇది అమలు కాలేదు. యాటీ సమీపంలోని ప్రభుత్వం మద్యంషాపు నుంచి మద్యం నిల్వలను బయటకు తరలించారు. ఈ విషయం ఎక్సైజ్ శాఖ దృషికి తీసుకువెళ్ళినా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ షాపుకు సంబంధించిన మద్యంను బ్లాక్‌లో విక్రయించారు. పెద్ద ఎత్తున మద్యం విక్రయాలు జరిగినా నామమాత్రంగా కూడా సదరు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై వారిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దాడికి ప్రతీకారం.. పూరిళ్లకు నిప్పు

పిల్లలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఘటన ● 20లక్షల ఆస్తి అగ్నికి ఆహుతి


అహత్యకు ప్రతీకారంగా కాలిపోయిన నాలుగు పూరిళ్లు

వినుకొండ, మార్చి8: అర్ధరాత్రి ముగ్గురు చంటి పిల్లలను హతమార్చాలని గడిపెట్టి ఇంటికి నిప్పు అంటించడంతో, నాలుగుపూరిళ్ళు దగ్ధమై, సుమారు రూ.20లక్షల ఆస్తినష్టం జరిగిన ఘటన పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. పాములకాలనీకి చెందిన పులి వెంకటేశ్వర్లు, నాగులూరి జంపన్నలు బంధువులు. ఇద్దరి మధ్య గురువారం ఉదయం ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఇరువురి మధ్య పెద్దమనిషిగా వెళ్లిన పోలా శ్రీనుపై పులి వెంకటేశ్వర్లు అదే రాత్రి కత్తితో దాడిచేశాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వైద్యశాలలో చికిత్స పొందుతున్న శ్రీనును చూసి తమ్ముడు పోలా బంగారయ్య శుక్రవారం తెల్లవారుజామున పులి వెంకటేశ్వర్లు ఇంటిని తగలబెట్టాడు. ఇంట్లో నిదరపోతున్న శ్రీనిధి, దివ్య, అపర్ణలను స్థానికులు కాపాడినప్పటికి, పక్కనే ఉన్న పగిడి నారాయణ, పగిడి వెంకటేశ్వర్లు, పులి వెంకటరమణ నివాస గృహాలు అగ్నికి ఆహుతయ్యాయి. జరిగిన ఘటనపై ఎస్ఐ ప్రసాద్‌ను వివరణ కోరగా సీఐ దృష్టికి తెచ్చామని, సీఐ కోటప్పకొండ బందోబస్తులో ఉన్నారని తెలిపారు. .


చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని నెట్టారు

● 1543 రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి 8: రాష్ట్ర బాగోగులు గాలికి వదిలేసి, సంపద కేంద్రం రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారని 33వేల ఎకరాలు అమరావతి నిర్మాణానికి భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, మూడు రాజధానులు వద్దు, అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా కొనసాగించాలని రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 1543వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, అమరావతిని అభివృద్ధి చేయటం చేతకాని ముఖ్యమంత్రి మూడు రాజధానులు కడతామని అనటం విడ్డూరంగా ఉందన్నారు. వేల ఎకరాలు భూములిస్తే అమరావతి నిర్మాణం కొనసాగించలేకపోవటం సిగ్గు చేటన్నారు. మూడు ముక్కల ఆటతో అధోగతి పాలు జేశారన్నారు. అధర్మంగా పాలించబట్టే వందల సార్లు వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మొట్టికాయలు వేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రాభివృద్ధి కాంక్షించే వాళ్ళైతే అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం మాకొద్దు, మాకొద్దు అంటూ తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో చేతులకు సంకెళ్ళు వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. సంక్షేమాల పేరిట పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వం, మహిళలను నడిరోడ్డు మీద నిలబెట్టిన ప్రభుత్వం మాకొద్దు, మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి అమరావతి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

టీడీపీతోనే మహిళా సాధికారత : యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 8: రాష్ట్రంలో టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని గురజాల మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అలవికాని హామీలిచ్చిన జగన్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయాడని ఆరోపించారు. పద్నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన అనుభవం వున్న చంద్రబాబు, యువతకు మంచి భవిష్యత్ ఇవ్వాలన్న ఆశయంతో ఉన్న పవన్‌కల్యాణ్ తీసుకున్న నిర్ణయాలు ప్రజల కోసమేనని గుర్తుచేశారు. కలలకు రెక్కలు అనే సరికొత్త పథకాన్ని మహిళల కోసం టీడీపీ, జనసేన నేతలు తీసుకురావడం జరిగిందన్నారు. ఇంటర్ పూర్తిచేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఈ పథకం కింద నమోదు చేసుకున్న మహిళలు తీసుకునే బ్యాంక్ రుణాలకు టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం హామీగా వుంటుందని, అంతేకాకుండా మహిళలు తీసుకునే రుణానికి వడ్డీ కూడా టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేసిన జగన్ ఎన్నికలలో ఓటమి తప్పదన్నారు. మహిళలకు మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ అన్నిరంగాల్లో వారు ముందుండాలని యరపతినేని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పాండురంగ శ్రీను, కామిశెట్టి రమేష్, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సీత, పాదర్తి రాజేశ్వరి, షేక్ నాగుర్‌బి, తదితరులున్నారు.

డీసీటీవో సస్పెన్షన్

● రూ.10 కోట్ల బిల్లుల భోగస్ క్లెయిమ్‌ల వ్యవహారంపై చర్యలు

గుంటూరు, మార్చి 8: బ్రాడీపేట సర్కిల్‌లో బోగస్ డీలర్ ఇన్‌వాయిస్‌ల క్లెయిమ్ వ్యవహారంలో డీసీటీవో మంజులపై సస్పెన్షన్ వేటు పడింది. బోగస్ డీలర్ నుంచి రూ.10 కోట్ల వరకు వాణిజ్య పన్నులశాఖ ఖజానాకు నష్టం కలగటంపై జరిపిన విచారణలో డీసీటీవో నిర్లక్ష్యం తేలటంతో ఆ శాఖ చీఫ్ కమిషనర్ గుల్జార్ సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే బ్రాడీపేట సర్కిల్‌లో మహీంద్ర కాటన్ పేరుతో ప్రొప్రయిటర్ యర్రబోతుల మహీంద్ర రెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకొని వ్యాపారం నిర్వహించారు. కాగా బోగస్ ఇన్‌వాయిస్ బిల్లులు సృష్టించి క్లెయిమ్‌లు చేసుకోవటంతో సీటీ శాఖకు రూ.10 కోట్ల నష్టం కలిగినట్లు అధికారులు గుర్తించారు. అసలు విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. బ్రాడీపేట సర్కిల్ ఏసీగా వ్యవహరిస్తున్న స్వామి వివేకానంద సదరు కాటన్ వ్యాపారి అడ్రస్‌కు వెళ్ళి పరిశీలించగా అక్కడ ఎవరూ లేకపోవటంతో పాటు బోగస్ వ్యాపార సంస్థ అని తేలినట్లు విచారణలో తేలింది. ఇందులో డీసీటీవో నిర్లక్ష్యం కారణంగా కోట్లలో నష్టం కలిగినట్లు గుర్తించిన ఉన్నతాధికారులు ఆమెపై సస్పెన్షన్ వేటు వేశారు. డీసీటీవో సస్పెన్షన్ వ్యవహారం ఆ శాఖ వర్గాల్లో కలకలం రేకెత్తిస్తోంది.

పోలీసుల అదుపులో టీడీపీ నేతలు

మాచర్ల రూరల్, మార్చి 8: పోలీసులు ఇరువురు టీడీపీ నేతలను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. మాచర్ల పట్టణంలో గత నెల 28వ తేదీన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నేపథ్యంలో టీడీపీ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వైసీపీ నేతలు ఆ ఫ్లెక్సీలను చింపివేయడంతో టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో 12 మంది టీడీపీ నేతలపై పట్టణ పోలీస్‌స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులోని ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ శరత్ బాబు తెలిపారు. మిగిలిన వ్యక్తుల కోసం గాలింపు చేపట్టినట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న ఇరువురు టీడీపీ నేతలను శనివారం కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు. కాగా పోలీసుల అదుపులో విద్యాధరణి మురళి, నర్రా గురవారెడ్డి ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

● శుభకార్యానికి వెళుతుండగా ఘటన


మృతి చెందిన జానీ బాషా, జమాల్

దాచేపల్లి, మార్చి 8: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న ఇరువురు వ్యక్తులు మలుపు వద్ద వున్న గోతులను తప్పించబోయి వాహనం జారిపడగా వారిని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే తీవ్రగాయాలపాలై మృతి చెందిన ఘటన శుక్రవారం దాచేపల్లి మండలం తంగెడ గ్రామం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన షేక్ జానీబాష(45), సయ్యద్ జమాల్(50) వారి సమీప బంధువులు. జాన్‌పాడ్ దర్గాకు ఓ శుభకార్యం కోసం వేమవరం నుంచి ద్విచక్ర వాహనంపై వారిరువురు బయలుదేరారు. తంగెడ డీఏవీ స్కూల్ సమీపంలో వున్న గోతులను తప్పించబోతుండగా ఒక్కసారిగా వాహనంపై నుండి కిందపడ్డారు. రోడ్డుపై పడిన ఇరువురు వ్యక్తులపై నుంచిఇ వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టి వెళ్లింది. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



శివరాత్రి పూజా కార్యక్రమాలలో పాల్గొన్న యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

భోళాలింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు

పిడుగురాళ్ల, మార్చి 8 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక భోళాలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం జరిగిన పూజా కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు చందోలు రామకృష్ణారావు, కమిటీ సభ్యులు యరపతినేనికి స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం యరపతినేనిని దేవాలయ కమిటీ సభ్యులు సత్కరించారు. పూజా కార్యక్రమాలలో యరపతినేని రమేష్, నిఖిల్, పాండురంగ శ్రీను, సర్వేశ్వరరావు, పచ్చిపులుసు రామ్మోహన్‌రావు, నెకరికంటి శివ, తదితర నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కాగానే సత్రశాల ఆలయాన్ని సుందరీకరిస్తా

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, మార్చి 8 : మే నెలలో చంద్రబాబునాయుడు నాల్గవసారి సీఎంగా పదవీ స్వీకార ప్రమాణం చేయగానే పల్నాట ప్రముఖ శైవక్షేత్రమైన సత్రశాలను అన్నివిధాల సుందరీకరిస్తానని జింకల పార్కు ఏర్పాటుకు కృషి చేస్తానని టీడీపీ మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి హామినిచ్చారు. మహా శివరాత్రి సందర్భంగా సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ జనసేన విజయదుంధుబి మోగించడం ఖాయమన్నారు. నీటి సౌకర్యం లేని కోటప్పకొండను ఎంతో అభివృద్ధి చేశారని, అలాగే కృష్ణానది ఒడ్డున గల సత్రశాలను అదే తరహాలో అభివృద్ధి చేసి తీరుతానని స్పష్టం చేశారు. తొలుత ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సమావేశంలో కుర్రి శివారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ డైరక్టర్ ప్రభురాజు యాదవ్, లింగయ్య యాదవ్, నీలం మల్లయ్య, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు గొట్టం శ్రీనివాసరెడ్డి, గిరిజన నేత ఊదే నాయక్, సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు సుమంత్‌రెడ్డి, రాయపరెడ్డి, టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి, బి.రామకృష్ణ, చేరెడ్డి కృష్ణారెడ్డి, సిద్దయ్య తదితరులున్నారు.



సత్రశాల ఆలయంలో పూజల్లో పాల్గొన్న బ్రహ్మారెడ్డి తదితరులు

దొనకొండ మల్లికార్జునస్వామిని దర్శించుకున్న బ్రహ్మారెడ్డి

కారంపూడి, మార్చి 8: మండలంలోని ఒప్పిచర్ల సమీపంలో గల దొనకొండలో మల్లికార్జునస్వామి ఆలయాన్ని శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి సందర్శించారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితుడు గోలి విశ్వనాథశాస్త్రి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మారెడ్డి వెంట టీడీపీ ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, వాణిజ్య విభాగం కార్యదర్శి పుల్లయ్య, బొల్నేని హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ ఉన్నారు. మండలంలోని చింతపల్లిలో రెడ్డిరాజుల కాలంలో నిర్మించిన దొడ్డా మల్లేశ్వరస్వామి, పెదకొదమగుండ్లలో పల్నాటి యుద్ధ సమయంలో నిర్మించిన ఉత్తరేశ్వరస్వామి, కారంపూడిలోని చారిత్రాత్మక సూరేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ప్రధాన అర్చకులు మణికంఠశాస్త్రి, వలివేటి వాసు ప్రత్యేక పూజలు జరిపారు.

శివాలయం అభివృద్ధికి కృషి చేస్తా

● టీడీపీ నేత భాష్యం ప్రవీణ్



మన్నె సుల్తాన్‌పాలెం శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నేత భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, మార్చి 8 : మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో గల శివాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నియోజకవర్గ టీడీపీ నేత భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం ఊరి చివర ఉన్న శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆలయాన్ని అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని, తాగునీటి సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వర్ల వెంకటేశ్వర్లు నివాసంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చి నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామి ఇచ్చారు. అనంతరం పాపాయపాలెం గ్రామంలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ విజయానికి కార్యకర్తలందరూ సహాయ సహకారాలు అందించాలని సూచించారు. మొట్టమొదటి సారిగా బెల్లంకొండ మండలానికి ప్రవీణ్ రావటంతో మండల టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలతో, బాణసంచాలతో గ్రామాలకు తీసుకువెళ్లారు. ఆయన వెంట రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకుడు వెంకట రామిరెడ్డి, నాగమణి బాయి, గుడిసె కొండయ్య, బల రామిరెడ్డి, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, మేళం శ్రీరామమూర్తి, హనుమంతరావు నాయక్, ఓర్సు రాంబాబు, వర్ల వెంకటేశ్వర్లు, సయ్యద్ జబ్బార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్రశాలలో జాతరే..జాతర



స్వామివారి సేవలో ఎమ్మెల్యే పీఆర్కే సోదరులు

రెంటచింతల, మార్చి 8 : పల్నాటప్రముఖ శైవ క్షేత్రం, కృష్ణానది ఒడ్డున గల సత్రశాల మహాశివరాత్రిసందర్భంగా శుక్రవారం భక్తజనంతో నిండిపోయింది. వేకువ జాము నుంచే ఆలయ పూజారి శర్మ నేతృత్వంలో సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, కుంకుమపూజ, జలబిందెలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. ఆలయ ఛైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఎంపీపీ సంపూర్ణమ్మ నేతృత్వంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పీఆర్కే దంపతులకు, వెంకట్రామిరెడ్డి దంపతులకు, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి వేద పండితుల మంత్రోచ్ఛాటనల నడుమ పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రివేళ స్వామి వారి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. స్పటిక శివలింగాన్ని వేలాది మంది దర్శించుకున్నారు. బ్రాహ్మణ, నాయి బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, ఆర్యవైశ్య, కమ్మ, కాపు, రెడ్డి,తొగటి వీర క్షత్రియ, వడయరాజులు, పెరిక, రజక, శాలివాహన, యాదవ, ముదిరాజ్‌లతో పాటు మొత్తం 19 సత్రాలలో వేలాది మందికి అన్నదానం చేశారు. సీఐ మల్లయ్య నేతృత్వంలో ఎస్‌ఐ కేవీ నారాయణరెడ్డి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎండోమెంట్ ఈవోలు నెమలిరెడ్డి, కృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. పరాశక్తి సిమెంట్స్ అధికారుల బృందం ప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

● శివనామ స్మరణతో మారుమోగిన శివాలయాలు

సత్తెనపల్లి, మార్చి 8 : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో ఉన్న శివాలయంలో, పాత శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివనామస్మరణలతో ఆలయాలు మారుమోగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. పట్టణంలోని వడ్డవల్లి నుంచి ప్రభలు కోటప్పకొండకు తరలివెళ్ళాయి. సత్తెనపల్లి నుంచి కోటప్పకొండకు అమరావతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయడంతో అధిక సంఖ్యలో భక్తులు శైవక్షేత్రాలకు తరలివెళ్ళారు

● రాజుపాలెం, మార్చి 8 : మండలంలోని పలు గ్రామాలలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో ని చౌటపాపాయపాలెం, బ్రహ్మణపల్లి, బలిజేపల్లి, గంగిరెడ్డిపాలెం, మొక్కపాడు, నెమలిపురి తదితర గ్రామాలలో శివరాత్రి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఉన్న శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాలను విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. ఆలయాల ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో ఉత్కంఠ వీరభద్రస్వామి

● నకరికల్లు, మార్చి 8 : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించు కొని మండలంలోని శివాలయాల్లో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకలగుంటలోని శ్రీ భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయంలో గురుప్రార్థన, గణపతి పూజ, మండపారాధన, ప్రధాన కలశ స్థాపన నిర్వహించారు. గణపతి, లక్ష్మీ, నవగ్రహ, శ్రీ రుద్రహోమాలు జరిపారు. స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకా దశ అభిషేకం, పంచామృత, సుగంధ, మంగళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. లింగోద్భవ కాల సమయంలో స్వామి కి విశేష అభిషేకాలు చేశారు. అర్ధరాత్రి సమయంలో శ్రీ భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి కల్యాణం నిర్వహించారు. చేజర్ల కపోతేశ్వరాలయంలో, నరసింగపాడు అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వ ర దేవాలయంలో, గుండ్లపల్లిలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో, చీమలమర్రిలోని సోమేశ్వరస్వామి దేవాలయంలో, నకరికల్లులోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో సుప్రభాత సేవ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. బలిహరణ, రుద్రహోమం, గ్రామోత్స వం నిర్వహించారు. చేజర్లలో నాలుగు వాహనాలతో గ్రామోత్సవం జరిపారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చక స్వాములు ప్రవీణ్ కుమార్, హనుమంతరావు, రాజేష్, వెంకట్రామయ్య శర్మ నిర్వహించారు.

● గురజాలటౌన్, మార్చి 8 : మండలంలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగాయి. ఉదయం నుంచే భక్తులు శివాలయాలకు పోటెత్తారు. మండలంలోని దైద అమరలింగేశ్వరస్వామి, గోగులపాడులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయాలకు భక్తుల రాకతో కిక్కిరిసిపోయాయి. ఓం నమఃశివాయ అంటూ భక్తి పారవశ్యంలో మునిగారు.



మాచర్లలో అర్థనారీశ్వరునిగా నగరేశ్వరస్వామి

● మాచర్ల రూరల్, మార్చి 8 : మాచర్ల పట్టణంలో మహాశివరాత్రి పండుగను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తుల రాకతో శివాలయాలు కిక్కిరిసిపోయాయి. పట్టణంలోని వీరభద్రస్వామి, నగరేశ్వరస్వామి, రామప్ప ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. నగరేశ్వరస్వామి భక్తులకు అర్థనారీశ్వరునిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అమరేశ్వరుని దర్శించిన ప్రముఖులు

అమరావతి, మార్చి 8 : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అమరేశ్వరస్వామి ఆలయాన్ని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ, విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీ కాంతం, గుంటూరు మాజీ మేయరు కన్నా నాగరాజు, సినీ దర్శకుడు ఓంకార్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. శ్రీకృష్ణదేవరాయలు స్వామివారిని దర్శించిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు, విద్యార్థులకు మంచి జరగాలని, రానున్న ఎన్నికలలో ప్రజలు కోరుకున్న ప్రజాప్రభుత్వం రావాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

పులిహోర పంపిణీ చేసిన ముస్లింలు





మహాశివరాత్రి భక్తులకు పులిహోర పంపిణీ చేస్తున్న ముస్లింలు, స్వామివారిని దర్శించుకుని వస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మహాశివరాత్రి పర్వదినానికి అమరేశ్వరాలయం సందర్శించిన భక్తులకు, పేదలకు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సహకారంతో స్థానిక ముస్లింలు పులిహోర పంపిణీ చేసి పరమత సహనాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కరిముల్లా, అల్లాభక్షు, షేక్ బాబు, అబ్దుల్‌గఫూర్, పకీర్‌ఉద్దీన్, మస్తాన్‌వలీ, అబ్దుల్ తో పాటు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొని పులిహోర పంపిణీ చేశారు. వీరితో పాటు అమరలింగేశ్వర కాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదానం, వాసవీసత్రం ఆధ్వర్యంలో ప్రసాదాలు, మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అన్నదానం, భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రసాదాలు, సాయి శ్రీనివాస మోడరన్ రైస్ మిల్ ఆధ్వర్యంలో పులిహోర, 1996-97 టెన్త్ బ్యాచ్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు.

● దుర్గి, మార్చి 7 : దుర్గిలో ఉన్న శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని తేరాలలో ఉన్న శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం భక్తుల రాకతో కిటకిటలాడింది. మొక్కులు తీర్చుకునేందుకు ప్రభలను ఏర్పాటు చేసి పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. అన్నదానం నిర్వహించారు.

● రెంటచింతల, మార్చి 8 : మహాశివరాత్రి సందర్భంగా కృష్ణా నది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారిలో పదవ అదనపు సెషన్స్ జడ్జి జి.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితరులున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఛైర్మన్ బ్రహ్మారెడ్డి, ఈవో నెమలిరెడ్డి స్వాగతం పలికారు.

● వెల్దుర్తి, మార్చి 8: మండలంలోని శైవాలయాలకు శుక్రవారం మహాశివరాత్రిని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వార్లకు అభిషేకాలు జరిపారు. గొట్టిపాళ్లలోని మార్కండేయస్వామి, ఉప్పలపాడు బుగ్గమల్లయ్యస్వామి, దావుపల్లిలోని శివునిబాయి, యర్రబాలెంలోని బాలనాగేంద్రస్వామి ఆలయాలు భక్తుల రాకతో కిక్కిరిశాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భారీగా అన్నదానం చేశారు.

●విజయపురిసౌత్, మార్చి 8: నాగార్జున సాగర్ జలాశయంలోని



ఏలేశ్వరం గట్టు వద్ద స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న శ్రీపాద సుబ్రహ్మణ్యశర్మ

ఏలేశ్వరం గట్టుకు మహాశివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం భక్తులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పోటెత్తారు. పర్యాటక శాఖ ఆధ్వర్యాన అనుపు నుంచి ఏలేశ్వరం గట్టుకు ప్రత్యేక లాంచీ సర్వీసులు నడిపారు. అర్చకుడు శ్రీపాద సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యాన స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మాచర్ల రూరల్ సీఐ సురేష్, విజయపురిసౌత్ ఎస్‌ఐ కొండారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. పర్యాటక శాఖకు రూ.2.73 లక్షల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు. స్థానిక లాంచీ స్టేషన్ వద్ద శివాలయంలో అర్చకులు జూనూతల నరసింహమూర్తి, ప్రశాంత్‌శర్మ ప్రత్యేక పూజలు జరిపారు. మాచర్ల మండలం భైరవునిపాడులో ఉన్న కాలభైరవస్వామి, శివనాగేంద్రస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

● దాచేపల్లి, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినంతో శివాలయాలు శివ నామస్మరణతో మారుమోగాయి. వేకువజాము నుండే భక్తుల రాకతో శివాలయాలు కిటకిటలాడాయి. పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రద్దీని తట్టుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. రాత్రి వేళ జాగారం చేసే భక్తులకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



మోర్జంపాడు సమీపంలోని బుగ్గమల్లేశ్వరస్వామి

● మాచవరం, మార్చి 8: మహా శివరాత్రి పర్వదినాన్ని పుర స్కరించుకొని మోర్జంపాడు సమీపంలోని బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పిడుగురాళ్ల, మాచవరం, బెల్లంకొండ, దాచేపల్లి మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మోర్జంపాడు, వేమవరం, మాచవరం, కొత్తపాలెంతో పాటు పలు గ్రామాలలోనూ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా దేవాలయాలలో భక్తులకు ప్రసాదం, అన్నదానం నిర్వహించారు.

● ముప్పాళ్ళ, మార్చి 8 : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని భక్తులు పలు శివాలయాలలో శుక్రవారం పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో కోటప్పకొండ శైవక్షేత్రానికి తరలివెళ్ళారు. సత్తెనపల్లి నుంచి ప్రభలతో తెల్లవారుజామునే ఊరేగింపుగా ముప్పాళ్ళ మండలం మీదుగా కోటప్పకొండకు తరలివెళ్ళారు. ఇరుకుపాలెం, మాదల, చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ, గోళ్ళపాడు గ్రామాలలో భక్తులు ప్రభలకు ప్రత్యేక పూజలు చేశారు.



గుత్తికొండ బిళంలో నూతన ఉత్సవ మూర్తులకు పూజా కార్యక్రమాలు

● పిడుగురాళ్ళ, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శివాలయం, నాగులగుడి, భోళాలింగేశ్వరస్వామి, గంగమ్మగుడి, గుత్తికొండ బిళంతో పాటు పలు గ్రామాలలో ఉన్న శివాలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. గుత్తికొండబిళంలో నూతనంగా గంగాపార్వతి సమేత బాలవంల్లేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో కుంబా బంగారు తిరుపతయ్య, గంగా పార్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు. భోళాలింగేశ్వరస్వామి దేవాలయం లో లక్ష గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. చిన అగ్రహారంలో ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయంలో అభిషేక పూజా కార్యక్రమాలు దేవాలయ అనువంశిక అర్చకస్వామి వెల్లటూరి చంద్రశేఖరశర్మ నిర్వహించారు.

● పెదకూరపాడు, మార్చి 8 : మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని పెదకూరపాడు, 75 తాళ్ళూరు, బలుసుపాడు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీగా అన్న ప్రసాద వితరణ జరిగింది.

● అచ్చంపేట, మార్చి 8 : మండలంలోని మాదిపాడు నదీ తీరం అంతా మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఓంకార నినాదంతో మారు మ్రోగింది. కృష్ణా జిల్లా, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట సుదూర ప్రాంతాల నుంచి మహాశివరాత్రి వేడుకలకు విచ్చేసిన భక్తులు మాదిపాడు వద్ద కృష్ణానదిలో స్నానాలు ఆచరించారు. మాదిపాడు వద్ద, పులిచింతల సమీపంలోని నందుల రేవు వద్ద భక్తులు స్నానాలు ఆచరించి పిండ ప్రదానాలు చేశారు. స్థానిక యువకులు భరద్వాజ గట్టు వద్ద అన్న సంతర్పణతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించి భక్తులకు బాసటగా నిలిచారు. అచ్చంపేట మండలంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

● బెల్లంకొండ, మార్చి 8 : బెల్లంకొండ ఊరి చివర ఉన్న శివాలయంలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం, చంద్రాజుపాలెం, మాచాయపాలెం గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలి వచ్చి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ నేత కంచేటి సాయి బెల్లంకొండ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సహాయ సహకారాలతో రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, మునగపాటి సుభానీ, చిట్టి, పీఎస్‌కే రసూల్, ఎన్.పిచ్చయ్య, సలాం, గురవయ్య, తెల్లమేకల నాగేశ్వరరావు, జవ్వాజి పాపయ్య, బుల్లెక్కయ్య, వీరాస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా బెల్లంకొండలో టీడీపీ నేత జానీని టీడీపీ నేత కంచేటి సాయి బాబు శుక్రవారం పరామర్శించారు. జానీ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారని తెలుసుకున్న కంచేటి సాయి ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించారు.



బెల్లంకొండ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నేత కంచేటి సాయి

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సత్తెనపల్లి, మార్చి 8 : టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో టీడీపీ మహిళా నేతలు సంధ్య, ఎం.శారదా దేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించి పలువురు మహిళలను సత్కరించారు. అమరావతి ఉద్యమంలో పాలు పంచుకున్న రైతు మహిళలు కొమ్మినేని వరలక్ష్మి, పారా రత్నకుమారి, నీరుకొండ అన్నపూర్ణ, మాదల పార్వతిలతో పాటు డాక్టర్ ఆళ్ళ సుమిత్రలను పూలమాలలు, బొకేలతో ఘనంగా సన్మానించారు. వారితోపాటు సంగీత కళాకారిణి రాజ్యలక్ష్మి, మహిళా సర్పంచ్‌లు బలిజేపల్లి రమాదేవి, మరియమ్మలను కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీ.సరోజిని, చుక్కపల్లి శాంత, రాణి, లక్ష్మి, ఉండు రమాదేవి, భాగ్యలక్ష్మి, పార్వతి, ఎలినేడి లక్ష్మీతులసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో స్టాఫ్ నర్సులను సన్మానించిన చిత్రం

● సత్తెనపల్లి మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఏరియా వైద్యశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేకును కట్ చేసి పంపిణీ చేశారు. స్టాఫ్ నర్సులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, ఆర్‌ఎంవో సోబారాణి డాక్టర్‌లు సుజాత, సుష్మ తదితరులు పాల్గొన్నారు. వాసవీ క్లబ్ ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలోని డాక్టర్‌లను ఘనంగా సన్మానించారు.

● రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన ఎం.శారదాదేవిని శుక్రవారం టీడీపీ ప్రజావేదికలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, సంధ్య, సీహెచ్ కొండలు, వై.లక్ష్మీ తులసి, శాంత కుమారి, సరోజినీదేవి, భాగ్యలక్ష్మి, రమాదేవి, మరియమ్మ, పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, మార్చి 8: మాచర్లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యాన పట్టణంలోని వైభవ్ రెసిడెన్సీలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. న్యాయాధికారి శారద మాట్లాడుతూ మహిళలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ఆత్మస్థైర్యాన్ని కోల్పోకూడదన్నారు. న్యాయాధికారి శారదతోపాటు గైనకాలజిస్ట్ రమావత్ విజయలక్ష్మి, జాగృతి మహిళా ఆర్గనైజేషన్ సభ్యురాలు నిమ్మగడ్డ సురేఖ, కోనేరు అరుణ, హెచ్‌ఎం షాకినా, పద్మావతి, తస్వీర్, కామేశ్వరి, మల్లేశ్వరి, విజయలక్ష్మి, హన్‌మత్‌లను దుశ్శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ పఠాన్ నాగూర్‌వలి, ఇక్కుర్తి శంకర్, కొండవీటి రామకోటయ్య, కృష్ణకుమారి, లక్ష్మి, రాధా తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబు, వంగపాటి నాగరాజు, కొమ్ము కోటేశ్వరరావు, దొడ్డా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, మార్చి 8 : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యాన మహిళా టైలర్లకు సన్మానం జరిపారు. తగిరశ సుధీర, ఊటుకూరి లక్ష్మి, నుంకేసుల నాగలక్ష్మి, కొనకంచి సుజాత, బత్తుల కోటేశ్వరిలను దుశ్శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అడిషనల్ గవర్నర్ భవిరిశెట్టి రామారావు, క్లబ్ అధ్యక్షుడు కర్నాటి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఆతుకూరి భాస్కర్, ట్రెజరర్ వెచ్చా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ళ, మార్చి 8: రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబన, ఆస్తిలో సమానహక్కు, రిజర్వేషన్ల కేటాయింపులో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు యరపతినేని నిఖిల్ తెలిపారు. పట్టణ టీడీపీ తెలుగు మహిళా కమిటీ ఆధ్వర్యంలో శుక్ర వారం పిడుగురాళ్లలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలకు బహుమతులు అందజేశారు. పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత, బొల్లా పద్మ, పాదర్తి రాజేశ్వరి, రాధ, రమణ, నిర్మల, మద్దినేని సైదమ్మ, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, అమీర్‌అలి, చల్లగుండ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ళ, మార్చి 8: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండమోడు సమీపంలో వున్న కెఎస్‌ఆర్ అండ్ పిఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. కళాశాల ఆంగ్ల ఉపాధ్యాయిని కోనేటి ప్రసన్న నరసింహారావు, మహిళా ఉపాధ్యాయులు ఎస్‌కె రజియా, డి శివనాగమల్లేశ్వరి, బి. ఇందులను ఘనంగా సత్కరించి నేటి సమాజంలో మహిళల పాత్రను పాఠశాల డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావులు వివరించారు. సాదినేని నరసింహారావు, దేపంగి సురేష్, వంగివరపు రాజా, మోటమర్రి సోమశేఖర్, తదితరులున్నారు.

కోరిన కోర్కెలు తీర్చే తల్లి సాగరమాత



భక్తులకు దైవ సందేశమందిస్తున్న డాక్టర్ గోవిందు జోజి

విజయపురిసౌత్, మార్చి 8: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తల్లి సాగరమాత అని నల్గొండ విశ్రాంత పీఠాధిపతి డాక్టర్ గోవింద్ జోజి అన్నారు. సాగరమాత ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం జోజి భక్తులకు దైవ సందేశమందించారు. క్రైస్తవులంతా సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. తోటి వారిని ఆదరించడం, ప్రేమను పంచడం క్రైస్తవ్యంలో ప్రాధాన్యమన్నారు. సృష్టికర్త సహితం అమ్మ ద్వారానే ఈ లోకానికి వచ్చారన్నారు. రాత్రి తేరు ప్రదిక్షణ గావించారు. సాగరమాత - సహాయమాత బుర్రకథ, ధనవంతుడు - బీదలాజరు బైబిల్ నాటకం ప్రదర్శన చేశారు.

కన్నుల పండువగా వీరబ్రహ్మేంద్ర స్వామి శాంతి కళ్యాణం



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న చిత్రం

క్రోసూరు, మార్చి 8 : మహాశివరాత్రి సందర్భంగా క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో ఉన్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి శాంతి కల్యాణ మహోత్సవం శుక్రవారం సాయంత్రం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మేళ తాళాలతో శాంతి కళ్యాణాన్ని నిర్వహించారు. దేవాలయం వద్ద ఐదు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్రోసూరులోని పురాతన మల్లికార్జున స్వామి, వీరభద్రస్వామి దేవాలయాలను తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించు కున్నారు. దేవాలయ ప్రాంగణంలో దీపారాధనలు చేసి స్వామి వారిని పూజించారు. మహాశివరాత్రి సందర్భంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృ తాభిషేకాలు నిర్వహించారు. పీసపాడు, ఎర్రబాలెం, బాలె మర్రు, విప్పర్ల, 88 తాళ్ళూరు గ్రామాల్లోని శివాలయాల్లో అఖండ దీపారాధనలతో పాటు స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దొడ్లేరులోని భీమలింగేశ్వర స్వామి దేవాలయం ఉదయం నుంచే భక్తులతో కిటకిట లాడింది. మహాశివరాత్రి సందర్భంగా అనేక మంది ఉపవాస దీక్షలు చేపట్టి గృహాల్లోని అఖండ దీపారాధనలను ఏర్పాటు చేశారు.

మాచర్లలో మార్పు రావాలి : కటికల

కారంపూడి, మార్చి 8 : మాచర్ల నియోజకవర్గంలో మార్పు రావాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా గురువారం రాత్రి కారంపూడి మైనార్టీ వీధిలో పార్టీ నేతలు పర్యటించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేత షేక్ మోదీన్‌సా, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జాని, ఆర్యవైశ్య సంఘ నేతలు కాసుల శంకర్, భవిరిశెట్టి పూర్ణచంద్రరావు, ఎస్‌పీఆర్ కృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాల్వ పేరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలునాయక్, పట్టణ కార్యదర్శి తోట నరసింహారావు, ఉపాధ్యక్షుడు నాగవరపు రాముడు, షేక్ నన్నేసా, జానీ, నాగలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



నరసరావుపేటలోని మహాశివుని విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

నరసరావుపేటలో తిరునాళ్ల సందడి

నరసరావుపేట, మార్చి 8: కోటప్పకొండ తిరునాళ్ల సందడి శుక్రవారం పట్టణంలో నెలకొంది. పట్టణం, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రభలు కొండకు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా పల్నాడు రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, కోటప్పకొండ రోడ్డు, బస్టాండ్ తదితర ప్రాంతాలలో తిరునాళ్ల కోలాహలం నెలకొంది. ప్రభల ముందు డప్పు వాయిద్యాలు, యువకులు నృత్యాలు చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న మహాశివుని విగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించారు. శివుని విగ్రహాన్ని మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన రహదారులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో తాగునీటి చలివేంద్రాలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాలలో తిరునాళ్ళకు వెళ్ళి వచ్చే యాత్రికులతో రద్దీ నెలకొంది. కమిషనర్ డీ రవిచంద్రారెడ్డి మునిసిపల్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఒకటవ, రెండో పట్టణ పోలీసు స్టేషన్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తుతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. శివుని విగ్రహం సెంటర్, పల్నాడు రోడ్డులోని ఎన్‌టీఆర్ విగ్రహం సెంటర్, వివిధ ప్రాంతాలలో సేవా సంస్థలు భక్తులకు పులిహోర, మంచి నీరు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

శివాలయాల్లో అభిషేకాలు

పట్టణంలోని శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గంగా పార్వతి సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయం, శృంగేరి శంకరమఠం, వాయు మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమలింగేశ్వరస్వామి ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, మార్చి 8: మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పలు ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. రొంపిచర్లలోని శంకరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, గోగులపాడులోని చంద్రమౌళేశ్వరస్వామి, మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వార్లకు అభిషేకాలను నిర్వహించారు. పంచామృతాభిషేకం పూజలు జరిగాయి. పార్వతిదేవి అమ్మవార్లకు కుంకుమ పూజలను నిర్వహించారు. భక్తులు పూజల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం భజన కార్యక్రమాలు జరిగాయి.



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ

వినుకొండ, మార్చి 8: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి దేవాలయ కొండ చుట్టూ శుక్రవారం గిరిప్రదక్షిణ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కొండమెట్ల వద్ద ఉన్న వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ముందుగా పూజలు నిర్వహించి హరహర శంభోశంకర అంటూ భజనా కార్యక్రమాలతో పెద్దసంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగవతుల రవికుమార్ మాట్లాడుతూ లోకకల్యాణం, వినుకొండ అభివృద్ధిని కాంక్షిస్తూ గిరిప్రదక్షిణ చేపట్టడం జరిగిందని, వినుకొండ అభివృద్ధి పథంలో సాగుతుందన్నారు. కొండకు ఘాట్‌రోడ్డుతో పాటు, కొండపై అద్భుతమైన గుడి నిర్మాణం, కొండ చుట్టూ గిరిప్రదక్షిణ రోడ్డుతో వినుకొండ మరింత ఆధ్యాత్మిక సంతరించుకుందని తెలిపారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహిళా భక్తులకు సత్కారం

వినుకొండ, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి సందర్భంగా విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని సాయిబృందావనం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హిమాలయ గురూజీ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించి ఎన్నో శిఖరాలను అధిరోహిస్తున్నారన్నారు. వినుకొండ అభివృద్ధికి కృషి చేస్తున్న హిమాలయ గురూజీ గురించి మక్కెన కొనియాడారు.

వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

వినుకొండ టౌన్, మార్చి 8: వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గుంటి ఆంజనేయస్వామి గుడి ఆవరణలో మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఖజ్జాయం విజయలక్ష్మి పాల్గొని 20 సంవత్సరాలుగా చేస్తున్న సేవల గురించి కొనియాడారు.

పట్టణంలో మహిళా దినోత్సవ ర్యాలీ



లీలావతికి శుభాకాంక్షలు తెలుపుతున్న సుంకర మణికంఠ యూత్

వినుకొండ, మార్చి 8: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ మహాలక్ష్మమ్మ బజారులోని సుంకర మణికంఠ యూత్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి భారీ ర్యాలీగా పాల్గొని శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ చైర్మన్ లీలావతిని కలిసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వినుకొండ అభివృద్ధిలో యువకులు ముందుండి టీడీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో శంకర్‌మణికంఠ, కృష్ణ, ప్రసన్న, ఫణి, సాయి, చిరంజీవి, తిరుపతి, చందు, రామాంజి, తరుణ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెషనల్ చదువులకు బ్యాంక్ రుణాలు: లీలావతి

వినుకొండ టౌన్, మార్చి 8: టీడీపీ - జనసేన అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి ప్రభుత్వంలో కలలకు రెక్కలు కార్యక్రమం ప్రారంభం అవుందని గోనుగుంట్ల లీలావతి అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసి విలేకరుల సమావేశంలో లీలావతి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరూ కలిసి ఆంధ్రప్రదేశ్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా కలలకు రెక్కలు పథకం ప్రారంభించారని తెలిపారు. ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులు పైచదువులకు వెళ్లాలి అనుకునే విద్యార్థులకు పథకం ప్రవేశపెట్టినట్లు ఆమె తెలిపారు. ప్రొఫెషనల్ కోర్సు నేర్చుకునే విద్యార్థులకు ప్రభుత్వం గ్యారెంటీతో బ్యాంక్‌రుణాలు తీసుకోవచ్చని, బ్యాంకు ఇచ్చే రుణాలపై వడ్డీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ పి. వేదవతి, పి.అంజలీదేవి, ఎం.ఆదిలక్ష్మి, ఎం.చౌడమ్మ, బి.లక్ష్మి పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం

వినుకొండ, మార్చి 8: పట్టణంలోని కారంపూడి రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి నిశంకర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమాశం నిర్వహించారు. ముందుగా పార్టీలోని వివిధ విభాగాల నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు టీడీపీ -జనసేన పార్టీ పొత్తుధర్మాన్ని అందరూ తప్పనిసరిగా పాటించాలని, కార్యకర్తల అభిప్రాయాలను ఖచ్చితంగా గౌరవిస్తామని, జెండాపట్టిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.



కోటప్పకొండ చానల్ స్నానఘాట్ వద్ద చిన్నారుల కోలాహలం



ప్రభల వద్ద ఏర్పాటుచేసిన వినోద కార్యక్రమాలను తిలకిస్తున్న ప్రజలు



కోటప్పకొండకు బస్సులో వస్తున్న కలెక్టర్, జేసీ దంపతులు, స్వామి వారిని దర్శించుకుంటున్న ఎంపీ కృష్ణదేవరాయలు, మాజీ మంత్రి ప్రత్తిపాటి



కోటప్పకొండ మెట్ల మార్గం వద్ద నెలకొన్న రద్దీ, కోటప్పకొండలో ట్రాక్టర్లలో కూర్చొని ప్రభలను తిలకిస్తున్న భక్తులు

ఘనంగా మహా శివరాత్రి ఉత్సవాలు



మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా హోమాల వద్ద పూజలు నిర్వహిస్తున్న గోనుగుంట్ల లీలావతి



కోటప్పకొండకు తరలివస్తున్న ప్రభ



కోటప్పకొండకు వెళ్లేదారిలో నిలిచిన ట్రాఫిక్

వినుకొండటౌన్, మార్చి 8: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని సాయి బృందావనం (చిన్నషిరిడి) వద్ద శాంతి ఆశ్రమ ట్రస్టు ఆధ్వర్యంలో శివరాత్రి మహోత్సవాలు హిమాలయ గురువు ఆశీస్సులతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు వినుకొండ నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా గణపతిపూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభించి సాయిబాబా మూలవిరాట్‌కు అభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన హోమగుండాల్లో రుద్రహోమం, మృత్యుంజయహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు పెండేల పుల్లారావు, కన్నెగండ్ల రామకోటేశ్వరరావు, పెండేల మోహన్‌రావు, డి.స్వామి, పెండేల సురేష్, మునిరెడ్డి, జెట్టి శ్రీనివాసరావు, సాయి పాల్గొన్నారు.

● నూజెండ్ల, మార్చి 8: మండలంలోని రవ్వవరం వెంకటేశ్వర జగన్నాథ పీఠం, రవ్వవరం, వీ అప్పాపురం, తలార్లపల్లి, పాతకొత్తపాలెం, ములకలూరు, చింతలచెరువు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అభిషేకాల్లో, అర్చనల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

● శావల్యాపురం, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కారుమంచి, మతుకుమల్లి, శావల్యాపురం, గంటవారిపాలెం, వేల్పూరు తదితర గ్రామాలలోని శివాలయాలలో పూజా కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే శివాలయాలకు చేరుకొని శివలింగాలకు పాలాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించి పూలమాలలతో ప్రత్యేక అలంకరణచేసి అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, నవగ్రహ పూజలు నిర్వహించారు. భక్తుల శివనామ స్మరణతో శివాలయాలు హోరెత్తిపోయాయి. కమిటీ సభ్యులు భక్తులకు పులిహోర, దద్దోజనం, చక్రపొంగలి తదితర ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం శివాలయాలలో భక్తులు భజనా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ములకలూరులో టీడీపీ ప్రభను ప్రారంభిస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు

● నాదెండ్ల, మార్చి 8: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు శుక్రవారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు ఆయా గ్రామాల్లో శివాలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని స్వామివార్లను అలంకరించారు. వివిధ రకాల అభిషేకాలు శివునికి నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. చిరుమామిళ్ళ గ్రామంలోని త్రికోటేశ్వరస్వామి దేవాలయంలో ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాతమ్మ, శ్రీనివాసరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

● నరసరావుపేట రూరల్, మార్చి 8: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నరసరావుపేట మండలంలోని అన్ని గ్రామాలలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట మండలం కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. మండలంలోని ములకలూరు, పెట్లూరివారిపాలెం, యలమందల, గురవాయపాలెం, కేశానపల్లి, గోనెపూడి, కాకాని, ఉప్పలపాడు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన ప్రభలను కోటప్పకొండకు తరలించేందుకు నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.

● ఈపూరు, మార్చి 8: మహాశివరాత్రి పండుగను మండలంలో శనివారం వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునుంచే శివనామస్మరణతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంజీవకొండ, ఈపూరు, కొచ్చెర్ల, ముప్పాళ్ళ, బొగ్గరం, ఇనుమెళ్ళ, కొండ్రముట్ల గ్రామాలలోని ఆలయాలలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చిలకలూరిపేటలో కోటప్పకొండ యాత్రికులకు సేవలు



యాత్రికులకు అన్నదాన, అల్పాహార కేంద్రాలు నిర్వహిస్తున్న సేవా సంస్థలు

చిలకలూరిపేట, మార్చి 8: మహా శివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్ళకు వెళ్లే భక్తులకు పట్టణంలోని వివిధ సెంటర్లలో సేవా సంస్థలు అన్నదానం, అల్పాహార, ఉచిత మజ్జిగ కేంద్రాలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో నరసరావుపేట సెంటర్‌లో భక్తులకు రెండు క్వింటాళ్ళ పులిహోర, ఐదు వందల లీటర్ల మజ్జిగ, వంద కిలోల జిలేబీ పంపిణీ చేశారు. జనసేన నాయకులు తోట రాజా రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డొక్కా సీతమ్మ అన్నదాన కేంద్రంలో భారీ ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, చరణ్ తేజ, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. అడ్డరోడ్డు సెంటర్‌లో రైజ్ సంస్థ వారు పది వేల మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, సీహెచ్ విజయకుమార్, వెటర్నరీ డాక్టర్ తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. క్షౌరవృత్తుల సంఘం వారు నరసరావుపేట సెంటర్‌లో యాత్రికులకు అల్పాహారాన్ని, మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, ఎం.సీతయ్య, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద భక్తులకు పులిహోర, లడ్డు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పటేల్, నాగేంద్రరరావు, పీ బ్రహ్మానందం, మురికిపూడి ప్రసాదు, ఆడిటర్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు. కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. కొమరవల్లిపాడు సొసైటీ చైర్మన్ కొండవీటి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెద్ద రథం సెంటర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జానకిపతిరావు ఆధ్వర్యంలో అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. కళామందిర్ సెంటర్‌లో ముదిరాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సూర్యబలిజ సంఘం ఆధ్వర్యంలో యాత్రికులకు అల్పాహార పంపిణీ కేంద్రాన్ని నిర్వహించారు. కాపు సేవా సంఘం, మల్లెల రాజేష్ నాయుడు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, మజ్జిగ, తాగునీటి సరఫరా కేంద్రాన్ని నిర్వహించారు. వైసీపీ నాయకుడు మల్లెల రాజేష్ నాయుడు కేంద్రాన్ని ప్రారంభించారు. రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కేంద్రాన్ని నిర్వహించారు. టీడీపీ ఆధ్వర్యంలో పురుషోత్తమపట్నంకు చెందిన దేవిశెట్టి వారు ఉచిత అన్నదాన కేంద్రాన్ని నిర్వహించారు. వైసీపీ ఆధ్వర్యంలో కూడా మజ్జిగ, తాగునీరు అల్పాహార కేంద్రం నిర్వహించారు. రైజ్ సంస్థ వారు ఆర్టీసీ సిబ్బంది, కోటప్పకొండ సిబ్బంది కోసం 4,800 మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు అందజేశారు. కాగా తిరునాళ్ళకు వెళ్లే భక్తులు, వాహనాలతో పట్టణంలోని కొండకు దారి తీసే రహదారులన్నీ కిటకిటలాడాయి.

ఆర్టీసీ ఉద్యోగులకు భోజనప్యాకెట్ల పంపిణీ

వినుకొండ టౌన్, మార్చి 8: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజన ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను, టోపీలను ఆర్టీసీ డీఎం కోటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంగినేని రాఘవ, లగడపాటి శ్రీనివాసరావు, ఎం.సురేష్, ప్రశాంత్, గోవిందయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మానం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అన్నదానం

చిలకలూరిపేట: జీడీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం భారీగా అన్నదానం నిర్వహించారు. శివరాత్రిని పురస్కరించుకొని చిలకలూరిపేట రూరల్ మండలంలోని యూటీ వద్ద గత తన పొలంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 32 సంవత్సరాలుగా ఆయన శివరాత్రికి వచ్చే యాత్రికుల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శుక్రవారం కూడా సుమారు ఏడు వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు డాక్టర్ మానం సురేంద్ర, దగ్గు మల్లి సాంబశివరావు తదితరులు పర్యవేక్షించారు. వైద్యులు, పట్టణ ప్రముఖులు, టీడీపీ నేతలు అన్నదాన శిబిరాన్ని సందర్శించి అభినందించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

రొంపిచర్ల, మార్చి 8: మండలంలోని రొంపిచర్లలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో కళ్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్వామి వారి కళ్యాణోత్సవంలో దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



అన్నదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన నాయకులు తదితరులు

సేవా కేంద్రాలను ప్రారంభించిన మాజీ మంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, మార్చి 8: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటప్పకొండకు వెళ్ళే భక్తుల సౌకర్యార్థం తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు ఏర్పాటు చేసిన వివిధ సేవా కేంద్రాలను మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావులు కలసి ప్రారంభించారు. ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో, అడ్డరోడ్డు సెంటర్‌లో జనసేన పార్టీ, పురుషోత్తమపట్నంలో స్థానికులు ఏర్పాటుచేసిన అన్నదాన శిబిరాలను వారు ప్రారంభించారు. అనంతరం మద్దిరాలలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన శిబిరాన్ని కూడా వారు ప్రారంభించారు. అలాగే పలుచోట్ల అల్పాహారం, మజ్జిగ, తాగునీటి శిబిరాలను ప్రారంభించి మాట్లాడుతూ మానవ సేవలోనే మనిషి జీవితానికి పరిపూర్ణ సార్థకత లభిస్తుందని తాను విశ్వసిస్తానని ప్రత్తిపాటి తెలిపారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నియోజక వర్గ టీడీపీ, జనసేన సమన్వయకర్తలు నెల్లూరి సదాశివరావు, తోట రాజా రమేష్, షేక్ కరిముల్లా, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, జువ్వాజి మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మిత్ర సొసైటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

చిలకలూరిపేట, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. రైతు బజారు వద్ద ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రశాంతి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు షేక్ హమీనా, కౌన్సిలర్ షేక్ సుభానీ, మీరాబీలను ఘనంగా సత్కరించారు. నరసరావుపేట సెంటర్‌లో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు కే నాగేశ్వరరావు, బీ శ్రీను నాయక్, బాల సుబ్రహ్మణ్యం, ఇంకా వెంకట నగేష్, షేక్ సుభానీ, మాదాసు పృథ్వీసాయి తదితరులు పాల్గొన్నారు.



మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులు

ఘనంగా మన్నెపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

బొల్లాపల్లి, మార్చి 8: మండలంలోని మన్నెపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ళ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రంవేళ వెంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా శివశక్తి లీలఅంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంగుపల్లి, మన్నెపల్లి తండా గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉచిత తాగునీటి ట్యాంకును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ రెండు గ్రామాల ప్రజలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జున్‌లను అభినందించారు. అదేవిధంగా దేవస్థానం వద్ద శివశక్తి లీలఅంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పులిహోర, తాగునీరు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, గోవిందునాయక్, జలగాల వెంకటేశ్వర్లు, బాబూరావు, బలడుగు శ్రీను, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు. సాయంత్రం వేళ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొనేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.



తాగునీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు

వివాహిత ఆత్మహత్య

నూజెండ్ల, మార్చి 8: ఆర్థిక లావాదేవీల విషయంలో చోటుచేసుకున్న మనస్పర్థలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రమణాలవారిపాలెంలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొత్తపల్లి రామాంజీ బొల్లాపల్లి మండలం పేర్లపాడు గ్రామానికి చెందిన కంచర్ల యల్లమ్మకు మూడు సంవత్సరాల క్రితం రూ.50వేలు నగదు ఇచ్చాడు. అనంతరం యలమ్మ కుమార్తెను వివాహం చేసుకున్నాడు. గురువారం యల్లమ్మ తన కుమార్తె అపర్ణ కోమలితో ఫోన్‌లో రూ.50వేలు నగదు అప్పుగా తీసుకున్న విషయంపై చర్చకు వచ్చింది. ఈ విషయంపై భర్త రామాంజీ, యల్లమ్మ, అపర్ణ కోమలిల మధ్య నగదు విషయంపై వాగ్వివాదం జరగటంతో మనస్తాపానికి గురైన అపర్ణ కోమలి (20) ఉరి వేసుకొని చనిపోయింది. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ సుధాకర్‌బాబు, ఇన్‌చార్జ్ ఎస్ఐ చెన్నకేశవులు శుక్రవారం పరిశీలించి వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తల్లి యల్లమ్మ ఫిర్యాదు మేరకు ఐనవోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఏడు నెలల వయస్సు ఉన్న కుమారుడు ఉన్నాడు.



మహిళలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

సంసిద్ పాఠశాలలో మహిళా దినోత్సవం

కనమర్లపూడి (శావల్యాపురం) మార్చి 8: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠశాలలో మహిళలకు అభినందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాఠశాల్లోని విద్యార్థుల తల్లులను సాదరంగా ఆహ్వానించి వారిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవో లలితాకుమారి, వైద్యాధికారి రమ్య పాల్గొని ఆటల పోటీలలో గెలుపొందిన మహిళలకు ప్రశంసాపత్రాలు, ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉండి, పురుషులకు దీటుగా నిలవాలన్నారు. అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. బాలబాలికలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ జమీర్, మేనేజర్ అజయ్‌కుమార్, ఎడ్మిన్ రాజేష్ పాల్గొన్నారు.